క్లుప్తంగా

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత ఆదిత్యునికి ఆదివారం ఆలయంలో పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

పెదపూడి: మండలంలోని చింతపల్లిలో కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన ముత్యాలమ్మ వారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పుట్టకొండలో సీతారాముల ఆలయ వార్షికోత్సవం

పుట్టకొండ గ్రామంలో సీతారాముల ఆలయ వార్షికోత్సవం, కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నెమలి సింహాసనం బహూకరణ



నెమలి సింహాసనం ఇదే..

రాజానగరం: పురాతన ప్రసిద్ధి చెందిన స్థానిక రాజలింగేశ్వర, రాజగోపాలస్వామి వారి ఆలయానికి దేవతామూర్తులకు కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు వీలుగా చెక్కతో తయారు చేయించిన నెమలి సింహాసనాన్ని బహూకరించారు. రిటైర్డ్ హెచ్ఎం ఆర్ఎస్ వెంకట్రావు 92వ జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారులు ఆర్.రామబ్రహ్మం, ఆర్‌వీవీఎస్ఎస్ మూర్తి ఆదివారం ఆలయ అర్చకులకు ఈ సింహాసనాన్ని అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెదపూడి: వాతావరణ మార్పులతో గ్రామాల్లో సీజనల్‌గా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం జి.మామిడాడలో ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డయేరియా, మలేరియా వంటి వ్యాధులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సచివాలయ అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపర్చాలని ఆదేశించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా దాసరి



దాసరి సుబ్బారావు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరానికి చెందిన దాసరి సుబ్బారావును బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా నియమించారు. ఆదివారం రాజమహేంద్రవరం కార్యాలయంలో బీజేపీ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి చేతుల మీదుగా నియామక పత్రాలను సుబ్బారావు అందుకున్నారు. తనకు అప్పగించి పదవి బాధ్యతలతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఓబీసీ జిల్లా కన్వీనర్ పట్టాల సాయి, నియోజవర్గం కో కన్వీనర్ అడబాల గణపతి, మండల అధ్యక్షుడు గూడపాటి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుష్ఫలితాలపై అవగాహన

ధవళేశ్వరం: స్థానిక బాలుర వసతి గృహంలో ఆదివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి హనుశ్రీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం–దుష్ఫలితాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెబ్ సౌత్ స్టేషన్ ఎస్సైలు బి.శ్రీనివాసరావు, వై.దుర్గాప్రసాద్ మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. బాలుర వసతి గృహం వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నారు మంచిదైతే పంట పండినట్టే

- ఆరోగ్యకరమైన నారుతో మంచి దిగుబడులు
- నారుమడుల తయారీలో అన్నదాతలు బిజీబిజీ
- అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో 45 శాతం నారుమళ్ల పూర్తి



నారుమడి సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు



గండ్రేడులో తయారైన నారుమడి

పెదపూడి: వరి సాగులో రైతులు నాణ్యమైన విత్తన ఎంపిక నుంచి కోతల వరకూ సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించొచ్చు. ప్రధానంగా ఆరోగ్యకరమైన నారును పెంచుకుంటే పంట బాగుంటుంది. ముందస్తు ఖరీఫ్ కోసం ప్రభుత్వం జూన్ 1వ తేదీనే కాలువల నుంచి సాగు నీరు విడుదల చేసినా చాలాచోట్ల శివారు పొలాలకు నీరు చేరలేదు. దీంతో అన్నదాతలంతా నారుమడుల తయారీ కోసం వరుణుడినే నమ్ముకున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో నారుమడుల తయారీలో రైతులంతా బిజీబిజీగా గడుపుతున్నారు. అయితే ఆరోగ్యకరమైన నారుని తయారు చేసుకుంటే మంచి దిగుబడులు సాధించొచ్చని పెదపూడి మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ సూచిస్తున్నారు.

86 వేల ఎకరాల్లో వరి సాగు

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం ఏడు మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో 86 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అనపర్తి మండలంలో 12,000 ఎకరాల్లో, పెదపూడిలో 18,000 ఎకరాల్లో, రంగంపేటలో 2,000 ఎకరాల్లో, బిక్కవోలు మండలంలో 13,000 ఎకరాల్లో, కోరుకొండ మండలంలో 15,000 ఎకరాల్లో, సీతానగరం మండలంలో 14,000 ఎకరాల్లో, రాజానగరం మండలంలో 12,000 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇప్పటివరకూ నియోజకవర్గంలో 45 శాతం మేర నారుమడులు, 3 శాతం మేర నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నాట్లు వేయడానికి పొలాన్ని తయారు చేయడం

నాట్లు వేయటానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేయుట ప్రారంభించి రెండు మూడు దఫాలుగా మురగ దమ్ము చేయాలి. పొలమంతా సమానంగా దమ్ము చెక్కతో గాని, అడ్డతో గాని చదును చేయాలి. రేగడి భూముల్లో నాట్లు వేయడానికి రెండు రోజుల ముందుగానే దమ్ము పూర్తి చేసి ఆ తర్వాతనే నాట్లు వేస్తే మంచిది. నారు తీసేటప్పుడు మొక్కలు లేతాకు పచ్చగా ఉంటేనే మూన త్వరగా తిరుగుతుంది. నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారును ఉపయోగించాలి. ముదురు ఆకును నాటితే దిగుబడి తగ్గుతుంది. నాట్లు పైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశముంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి ఖరీఫ్‌లో చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా చూడాలి. బాగా మెత్తగా, బరువైన నేలల్లో దమ్ము చేసిన 2–10 రోజుల లోపు నాట్లు వేయడం ముగించాలి. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల బాటలు తీయటంతో పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి అదుపు చేయొచ్చు. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు వేయటానికి ఇంకా పైరు పరిస్థితిని గమనించటానికి ఈ బాటలు బాగా ఉపయోగపడతాయి.

వ్యవసాయ అధికారుల సూచనలివీ

- నారుమడి తయారీకి సంబంధించి ముందుగా అన్నదాతలు 10–12 రోజుల వ్యవధిలో పొలంలో మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేయాలి.
- ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని(ఒక కిలో విత్తనం చల్లేముందు, మరో కిలో విత్తిన 12–14 రోజులకు), ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాలి.
- శిలీంద్ర నాశనితో శుద్ధి చేసి మొలకకట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు, ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకూ ఆరుతడులు ఇచ్చి తర్వాత పలుచగా నీరు నిల్వ కట్టాలి.
- జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి రెండు గ్రాములు జింకు సల్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేక క్లోరిపైరిఫాస్ 2.0 మిల్లీ లీటర్లు నీటికి కలిపి విత్తిన 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలి.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



సీతానగరంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

సీతానగరం: బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఆయన చిత్రపటానికి బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాసరి సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ సమస్యను ముందుగా అర్థం చేసుకుని ప్రత్యేక అధికారాలు, స్వయం ప్రతిపత్తిని వ్యతిరేకించారని, ఆర్టికల్ 370ని తీసుకురావడాన్ని ఆయన ఖండించారని తెలిపారు. ఆయన చేసిన సుదీర్ఘ పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాపాక వెంకటలక్ష్మి, ఎస్.లక్ష్మణరావు, సీపీఐ ఎంఎల్ నాయకులు పలివెల వీరబాబు, వెంకట రామరాజు, కోండ్రపు నాగమణి, డి.సూర్యవతి పాల్గొన్నారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజానగరం మండలం పల్లకడియం గ్రామంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి హనుశ్రీ, సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో గెడ్డం రామాయమ్మను అదుపులోకి తీసుకుని 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ తెలిపారు.

హమ్మయ్య.. వాతావరణం చల్లబడింది



రాజానగరంలో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షం నీరు

రాజానగరం: నైరుతి రుతు పవనాల రాకతో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి వేసవి ఎండల తీవ్రత నుంచి జనం కాస్త ఊరటపొందారు. ఆరుద్ర కార్తెలో కూడా రోహిణీ కార్తె మాదిరిగా ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ తరుణంలో పలుచోట్ల వర్షాలు కురిసి వాతావరణంలో చల్లదనం ఏర్పడడంతో ఉక్కపోత నుంచి జనం కాస్త ఉపసమనం లభించినట్టుగా అనుభూతిని పొందుతున్నారు. ఈ వర్షానికి పలు ప్రాంతాల్లో పల్లపు ప్రాంతాలతో పాటు రోడ్లు కూడా జలమయమయ్యాయి. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్, బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్, సూర్యారావుపేట జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు పై వర్షం నీరు కాలువగా ప్రవహిస్తోంది. అదే విధంగా రాజానగరం–అనపర్తి రోడ్డులో కానవరం, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడ ప్రాంతాల్లోను, వెలుగు బంద కూడలిలోను రోడ్లపై నీరు నిలిచేంతగా వర్షం కురిసింది. కాగా ఈ వర్షం జనావళికి చల్లదనాన్నిస్తుంటే అన్నదాతలకు తొలకరి సాగుకు సమాయత్తమయ్యేందుకు అవకాశం కల్పిస్తూ శ్రీకారం చుట్టిందని చెప్పవచ్చు. మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ సాగుకు బోర్లు ఉన్నచోట ఇప్పటికే చాలామంది రైతులు నార్లు పోసి, పొలాలు దుక్కులు చేస్తున్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు ఇలా అడపా దడపా కురుస్తుంటే మిగిలిన రైతులు కూడా ఖరీఫ్ సాగును వేగంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

రాజానగరంలో భారీ వర్షం

రాజానగరంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కుంభవృష్టిగా కురిసిన వర్షం 60.8 మిల్లీమీటర్లు నమోదైంది. ఇప్పటివరకు జూన్ నెలలో మూడు పర్యాయాలుగా 93.4 మిల్లీమీటర్లు వర్షం కురిసినట్టుగా రికార్డుల్లో నమోదు కాగా ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షమే అత్యధికంగా చెప్పవచ్చు. ఖరీఫ్ వరి సాగుతోపాటు అపరాలు సాగు చేసే రైతాంగానికి కూడా ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఎమ్మెల్యే బలరామకృష్ణకు ఘన స్వాగతం



గాడాలలో ఎమ్మెల్యే బలరామకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న కూటమి నాయకులు, అభిమానులు

మధురపూడి: రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు ఆదివారం కోరుకొండలో ఘన స్వాగతం లభించింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన రాజానగరం నియోజకవర్గం నుంచి గెలుపొందారు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం నియోజకవర్గానికి వచ్చిన బత్తులకు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే గాడాల, బూరుగుపూడి, కోరుకొండ మీదుగా గాదరాడ వెళ్లారు. అక్కడ ఆయా పార్టీల నాయకులు గజమాలలతో సత్కరించారు. అక్కడి నుంచి కోరుకొండ వచ్చి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం గాదరాడ వెళ్లి పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

ట్రాఫిక్ మళ్లింపు

బత్తుల ర్యాలీతో ఆర్టీసీ బస్సులు, కార్లు నిలిచిపోయాయి. ప్రయాణికులకు అసౌకర్యంగా ఉండడంతో నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాసులు స్వయంగా వాహనాలను పంపించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అమర్‌నాథ్ ఎందరికో స్ఫూర్తిదాయకం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ ఉండవల్లి
- కబడ్డీ చాంపియన్ షిప్ నిర్వహిస్తాం : జక్కంపూడి గణేష్



అమర్‌నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ ఉండవల్లి, జక్కంపూడి గణేష్

ప్రకాశం నగర్: ప్రముఖ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు కుంపట్ల అమర్‌నాథ్ ఎందరికో స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీ వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ధర్మంచర కమ్యూనిటీ హాలులో కుంపట్ల అమర్‌నాథ్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, జక్కంపూడి గణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజా మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు తన రాజకీయ ప్రస్థానంలో ఎటువంటి ఆర్థిక బలం లేనప్పటికీ స్నేహితుల ప్రోద్బలం సహకారంతోనే అంచెలంచెలుగా రాజకీయాల్లో ఉన్నత స్థితికి చేరుకున్నారన్నారు. తన తండ్రి స్నేహితులలో ఒకరైన అమర్‌నాథ్‌తో చిన్నప్పటి నుంచి ఎంతో అనుబంధం ఉందని, ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు కె.సత్రాజు రాజీవ్ గాంధీకి అనువాదకుడిగా తన పేరు సూచించారని, అయితే దీని వెనుక అమర్‌నాథ్ ప్రోద్బలం ఉన్నట్టు తరువాత తెలిసిందన్నారు. 1972 నుంచి అమర్‌నాథ్ జక్కంపూడితో తనతో కలిసి పనిచేశారన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కుంపట్ల అమర్ నాథ్ పేరిట మెమోరియల్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించి క్రీడా రంగానికి ఆయన చేసిన సేవలను తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయుడు కృష్ణకుమార్ అధ్యక్షత వహించగా, మాజీ కార్పొరేటర్ ప్రసాదుల హరినాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు పంతం కొండల రావు, నక్కా శ్రీనగేష్, చాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, జామీశెట్టి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది నిరంతర కృషితో బ్యాంకు అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కోళ్ల బాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సిబ్బంది నిరంతర కృషితో బ్యాంకును అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లామని ది ఇన్నీసుపేట కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు(బాబు) అన్నారు. ఆదివారం స్థానిక గౌతమ ఘాట్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ కల్యాణ మండపంలో జరిగిన బ్యాంకు 106వ మహాజన సభ ఆయన అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కోళ్ల బాబు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అభివృద్ధి పథంలో ముందు ఉన్న బ్యాంకుకు ఈ ఏడాది నిరర్థక ఆస్తులు జీరో రావడం సంతోషకరమని వెల్లడించారు. మిగిలిన బ్యాంకుల కంటే అతి తక్కువ సిబ్బందితో ఉన్నప్పటికీ మంచి ఫలితం సాధ్య పడిందన్నారు. తక్కువగా ఉన్న సిబ్బంది బ్యాంకు అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు శ్రమించడం మూలంగా ఇది సాధ్యమైందన్నారు. బ్యాంకు గ్రాస్ బెనిఫిట్ 2.46 శాతం వచ్చిందని, గతంలో 10 శాతంగా ఉన్న డివిడెండ్‌ను 11 శాతానికి పెంచామని తెలిపారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ పాలకోడేటి రమణ కుమార్, బ్యాంకు వైస్‌చైర్మన్ గేడి పోతురాజు, బ్యాంకు డైరెక్టర్లు ఆదిరెడ్డి శ్రీనివాసరావు, అందనా పల్లి సత్యనారాయణ, కటారి శ్రీనివాస్‌కన్నా, నారపురెడ్డి సన్ని, జామి వెంకట రమణ మూర్తి, పొడిపి రెడ్డిశివ, పంచ కట్ల శివ ప్రసాద్, దాది సత్యనారాయణ, గుత్తుల భాస్కర రావు, రెడ్డి సూర్య సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



చిల్డ్రన్ పార్కు ముఖ ద్వారం



అంకెల పజిల్



గ్లోబ్



పెన్సిల్ వాల్

చిన్నారులకు నచ్చేలా.. విజ్ఞానం పెంచేలా..



డ్రోన్ ద్వారా తీసిన పార్కు చిత్రం

- వినూత్నంగా తయారు చేసిన చిల్డ్రన్స్‌పార్క్
- రూ.1.98 కోట్లతో నిర్మాణం
- ప్రారంభోత్సవానికి సిద్ధం



జిగ్‌జాగ్ సైకిల్ ట్రాక్

రాజమహేంద్రవరం సిటీ: చిన్నారులు బాగా ఇష్టపడేది పార్కులు. ఈ పార్కుల్లో ఆహ్లాదం, వినోదంతోపాటు విజ్ఞానం కూడా అందించేలా సరికొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. పిల్లలకు నచ్చేలా వినూత్నంగా తయారు చేస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా), నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.కోటి 98 లక్షల వ్యయంతో పార్కును నిర్మిస్తున్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు జాతీయ రహదారి పక్కన భారత్ పెట్రోల్ బంకును అనుకుని ఉన్న ఈ స్థలంలో నగరపాలక సంస్థ చిన్నారులకు ప్రత్యేకంగా పార్కును సిద్ధం చేసింది.

పార్కులో అంశాలు

ఈ పార్కులో పర్యావరణ సమతుల్యాన్ని పాటిస్తూ అనేక ఆధునిక కార్యక్రమాలు చేపట్టింది. స్థానికులు అభ్యర్థన మేరకు జాతీయ దినోత్సవాలైన రిపబ్లిక్ డే, స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండా ఆవిష్కరణకు జాతీయ జెండా స్థూపాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారులకు సైకిల్ ట్రాక్, చిల్డ్రన్ ప్లే ఎక్విప్మెంట్ జోన్, పెన్సిల్ వాల్, స్ప్రింగ్ టు గెదర్(తండ్రి కొడుకులు ఒకేసారి ఊగే ఊయల)చిన్నారులకు తల్లిపాలు అందించేందుకు మదర్ ఫీడింగ్ రూమ్, విజ్ఞానదాయక చిత్రాల ప్రదర్శనలకు అవసరమైన స్క్రీన్ అందుబాటులో ఉంచారు. సముద్రం ఒడ్డున ఉండే ఫీల్ కలిగించే బీచ్‌ను పోలిన ప్రదేశం(సేండ్ జోన్) తయారు చేశారు. పర్యావరణ హితంగా గ్రీనరీ, ప్రత్యేక ఆకర్షణగా మూడు ఆర్చ్‌లు, స్టోరీ టెల్లింగ్ (చిన్నారులకు ఒక వ్యక్తి అక్కడి స్టోరి చెప్పే విధంగా ఏర్పాటు), 50 లైట్లు (ఏ నుంచి జెడ్ వరకు తెలియజేసే లైట్లు) ఒకటి నుంచి 100 వరకు అంకెలు గల టేబుల్, పలు రకాల పజిల్స్, ప్రపంచాని తెలియజెప్పే గ్లోబ్, లూడో, చదరంగం, షేడ్ సిటింగ్, జిగ్ జాగ్ సిటింగ్ తదితర వాటిని ఏర్పాటు చేశారు.

త్వరలోనే అందుబాటులోకి..



నగర ప్రజలకు వినూత్న రీతిలో చిన్నారులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచేలా చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణం చేపట్టాం. త్వరలోనే నగర ప్రజలకు అందుబాటులోనికి రానుంది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా లేనివిధంగా ఈ పార్కును సిద్ధం చేశాం. చిన్నారులు అడుగు పెడితే చాలు విజ్ఞానంతో బయటకు వెళ్లాలనే సంకల్పంతో ప్రత్యేకంగా తయారు చేశాం. వినూత్న తరహాలో పలు రకాల అంశాలను జోడించి సిద్ధం చేశాం. చిన్నారులను ఆటపాటల ద్వారా మరింతగా ఆకట్టుకునేలా పార్కు ఉంటుంది. ఒకసారి సందర్శించిన చిన్నారులు మళ్లీ మళ్లీ రావాలనే ఆలోచన కలుగుతుంది.

– దినేష్‌కుమార్, కమిషనర్, నగర పాలక సంస్థ రాజమహేంద్రవరం